
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న స్పీకర్

## పథకాలు పక్కదారి పట్టకుండా నిఘా

కాంగ్రెస్ క్యాడర్‌కు స్పీకర్ ఆదేశం

**మోమిన్‌పేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలు పక్కదారి పట్టకుండా కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో నిఘా పెట్టాలని రాష్ట్ర శాసన సభా పతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మోమిన్‌పేట మండల పరిధిలోని రాంనాథ్ గుడుపల్లి గ్రామంలోని చించల్‌పేట పద్మారాణి మహేష్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ.. ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి తీరతామని హామీ ఇచ్చారు. గత పది సంవత్సరాలు పాలించిన కెసిఆర్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేకపోయిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతిగ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొత్త బసవేశ్వర్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్, నర్సింలు, గ్రామ పంచాయతి వార్డు సభ్యులు శ్రీనివాస్ నాయి, అజీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విధులకు ఎగనామం!



బడి బయట ఆడుకుంటున్న విద్యార్థులు

దుర్గాపూర్ బడిలో హెచ్‌ఎమ్ ఇష్టారాజ్యం
ఉదయం 11 గంటలకే జంప్...
మీడియా ఎంట్రీతో వాట్సప్‌లో ఆన్‌లైన్ లీవ్ నాటకం
పాఠశాలకు నేమ్‌బోర్డులోనూ నిర్లక్ష్యం
మండిపడుతున్న గ్రామస్తులు

**పెద్దేముల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** బడి బండికి బాధ్యతే ఇంధనం. కానీ దుర్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆ బాధ్యత పూర్తిగా పక్కదారి పట్టింది. అమాయక చిన్నారుల భవిష్యత్తుతో చెలగాట మాడుతున్న ఉపాధ్యాయుల తీరు, అధికారుల ఘోర నిరక్ష్యం ఇక్కడ స్పష్టంగా బట్టబయలవుతున్నాయి. అసలు ఆ ప్రాంగణంలోకి అడుగుపెడితే అది ప్రభుత్వ పాఠశాలనా లేక అనాథ శరణాలయమా అనే అనుమానం రాక మానదు. పాఠశాల ఉనికిని తెలిపే ఒక్క నేమ్ బోర్డు కూడా లేదంటే అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 34 మంది చిన్నారులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి వస్తే, వారిని దేవుడి దయకు వదిలేసి ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా చోటుచేసుకున్న ఘటనే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. పాఠ శాలకు బాధ్యుడిగా ఉండాల్సిన హెచ్‌ఎమ్ , ఉదయం 11 గంట లకే బోర్డు తిప్పేసి జారుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలు దాటి నా ఆయన జాడ లేదు. తీరా విలేఖరులు వచ్చి ఆరా తీసేసరికి, తప్పు కప్పు పుచ్చుకోవడానికి 2:46 గంటలకు లీవ్ అప్లై చేసి వాట్సప్‌లో పంపామని బుకాయించారు. ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న సిబ్బంది భాధ్యతలపై ఉన్నతాధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు సమయపాలనకు స్వస్తి చెబుతుండటంతో విద్యా ర్థుల భవిషత్తుతో చెలగాటం ఆడుతున్నారని మండిపడుతున్నారు. విద్యావాలంటీర్ల తొలగింపు తరువాత కూడా పాఠశాలలో వారి సేవలు కొనసాగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.
ఈ విషయాలపై యంఈఓ నర్సింగ్‌రావును విలేకరులు ప్రశ్నిం చగా.. దుగ్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ తరపున ఎవరిని నియమించలేదని వివరణ ఇచ్చారు. అధికారులు తగిన పర్యవేక్షణ లేకపోవడంతో డ్యూటీ టైంలో హెచ్‌ఎం సొంతపనులు చక్కదిద్దుకుంటూన్నరని గ్రామస్తులు ఆరోపించారు. పాఠశాల చదువులు గాడిలోపడే విధంగా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అంపశయ్యపై అక్షరాలయం

ఉద్దండులను అందించిన ఘనత
నేడు మనుగడ కోసం అవస్థ



ఒకప్పుడు ఆ బడి ముంగిట నవ్వులు పూసేవి. వందలాది మంది పిల్లల అడుగుల చప్పుడుతో, ప్రార్థనా గీతాలతో ఆర్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం ప్రతినిత్యం పరవశించిపోయేది. వంద శాతం ఫలితాలతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి గర్వంగా తలనెత్తుకున్న ఆ పాఠశాల నేడు కళావిహీనంగా మారింది.

**మాడ్గుల, ఆగస్టు26, ప్రభాతవార్త:** ఒకప్పుడు గ్రామీణ విద్యకు చిరునామాగా, వేలాది మంది పిల్లల అడుగుల చప్పుడుతో కళకళలాడిన ఆర్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేడు మనుగడ కోసం పోరాడుతోంది. 1990-91లో పదో తరగతి ప్రారంభమైన కొద్ది కాలంలోనే, 1992-93 నాటికి ఏకంగా 380 మంది విద్యార్థులతో ఈ ప్రాంతంలోనే అత్యంత రద్దీగా ఉండే విద్యాలయంగా పేరుగాంచింది. అందుకుల, సుద్దపల్లి, నర్సంపల్లి, అన్నబోయినపల్లి వంటి గ్రామాలు, తండాల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకునేవారు. 1999 -2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే తొలి స్థానంలో నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. మాజీ ఎంపీపీ జర్పుల జైపాల్ నాయక్, సర్పంచులు ఏ. జంగయ్య, ఆర్. బిక్కయ్య, వసురాం నాయక్ వంటి ప్రజాప్రతినిధులతో పాటు కమర్షియల్ టాక్స్, పంచాయతీరాజ్, బ్యాంకింగ్ రంగాల్లో ఉన్నతాధికారులుగా రాణిస్తున్న ఎంతోమందిని సమాజానికి అందించిన ఘనత ఈ పాఠశాలది. కానీ, 2026-27 విద్యా సంవత్సరానికి వచ్చేసరికి ఇక్కడి పరిస్థితి దారుణంగా మారింది. ఒకప్పుడు 380 మందితో వికసించిన ఈ బడిలో ప్రస్తుతం కేవలం 54 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. ఘోరమైన విషయమేమిటంటే, ఏడో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా లేరు. ప్రస్తుతం పదో తరగతిలో ఉన్న 24 మంది ఈ ఏడాది చదువు పూర్తి చేసుకుని వెళితే పాఠశాల ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉంది.
ప్రైవేట్ విద్యపై మోజు, సమీప పట్టణాలకు వలసలతో పాటు మౌలిక వసతుల కల్పనలో గత ప్రభుత్వ నిరక్ష్యమే ఈ దుస్థితికి కారణమని పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రస్తుత టెన్త్ బ్యాచ్ తర్వాత పాఠశాల ఉనికి ప్రశ్నార్థకం**

అయితే, కన్నతల్లిలాంటి బడి రుణం తీర్చుకోవడానికి మమకారం ముందడుగు వేసింది. పంచాయతీరాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్న పూర్వ విద్యార్థి షేక్ షబీర్ హుస్సేన్ తన వంతు బాధ్యతగా ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు రూ.10వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని ప్రకటించి బడికి ఊపిరిలూదే ప్రయత్నం చేస్తున్నారు. నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున తల్లిదండ్రులు ప్రైవేటు మోజు వీడి ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు సమష్టిగా కృషి చేస్తేనే వేలాది మందికి భవిష్యత్తునిచ్చిన ఈ అక్షర ఆలయానికి మళ్లీ పూర్వ వైభవం సాధ్యమవుతుంది.

ఒకప్పుడు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన ఆర్కపల్లి హైస్కూల్
380 నుంచి 54 మందికి పడిపోయిన విద్యార్థుల సంఖ్య
పది వరకూ తరగతులున్నా.. ఏడులో అడ్మిషన్‌లు జీరో
ఊపిరిలూదే ప్రయత్నం చేస్తున్న పూర్వ విద్యార్థులు
పూర్వ వైభవం కోసం పాలకులు నడుంబిగించాలని పిలుపు

# పక్కా వ్యూహంతో ఖాతాలు ఖాళీ

నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాలు : సిపి సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** నగర పరిధిలో సాంప్రదాయ జేబుదొంగతనాలకు ఆధునిక సైబర్ నేరాలను జోడించి అమాయకుల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్న సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైద రాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు హెచ్చరించారు. ముఖ్యంగా సీని యర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు వ్యవస్థీకృతంగా దోపిడీకి పాల్పడుతునట్లు తమ విచారణలో బయటకు వచ్చిందని ఆయన తెలిపారు. ఈ తరహా నేరాల పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం జరిపిన దర్యాప్తులో ముగ్గు రు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది. ఈ ముఠాలు ఒక పక్కా వ్యూహం ప్రకారం వివిధ దశల్లో నేరాలకు పాల్పడుతున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాలలో స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను వీరు మొదట గుర్తిస్తారు. బాధితులు ఫోన్ వాడుతున్నప్పుడు వారు ఏ విధంగా స్క్రీన్ లాక్ ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి చాలా నిశితంగా గమనిస్తారు. ఆతర్వాత అదును చూసి బాధితుల దృష్టి మరల్చి జేబులు లేదా బ్యాగుల నుంచి మొబైల్ ఫోన్లను చోరీ చేస్తారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి ఉండి, పాస్‌వర్డ్ వారికి తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెరలేపుతారు. బాధితుడు తన పోయి న ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి, తాము బస్సు కండక్టర్ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని, వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మి స్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరి కిందని, వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని క్లెయిమ్ చేస్తున్నారని చెబు తూ.. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మిం చి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఫోన్ అన్‌లాక్ అవ్వగానే నిందితులు ఫోన్ గ్యాలరీ, నోట్స్, మెసేజ్‌లు, వాట్సాప్ చాట్‌లను పూర్తిగా జల్లెడ పడతారు. ప్రజలు సాధారణంగా గ్యాలరీలో భద్రపరుచుకునే డెబిట్/క్రెడిట్ కార్డుల ఫోటోలు, ఆధార్, పాన్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు, నోట్స్ యాప్‌లో రాసుకున్న పిన్‌లను సేకరిస్తారు. చోరీ చేసిన సిమ్ కార్డు నేరగాళ్ల చేతిలోనే ఉండటంతో, ఫోన్‌లోని యూపీఐ, బ్యాంకింగ్ యాప్స్ ఓపెన్ చేసి, వచ్చే ఓటీపీల ద్వారా నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లను, యూపీఐ పిన్‌లను రీసె ట్ చేస్తారు. అనంతరం క్షణాల వ్యవధిలో బాధితుల ఖాతాల నుంచి నగదు ను వేరే ఖాతాలకు బదిలీ చేస్తారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఈ డబ్బును నేరుగా వ్యక్తిగత ఖాతాల్లోకి వేసుకోకుండా, వివిధ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, డిజిటల్ వాలెట్లు, కమీషన్ ఆశచూపి సేకరించిన మ్యూల్ అకౌంట్ల ద్వారా నగదును మళ్లించి చివరకు డ్రా చేసుకుంటున్నారు.

**ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

ఫోన్ పోయినప్పుడు ఎవరైనా లిఫ్ట్ చేసి కండక్టర్‌నని చెప్పినా లేదా ఫోన్ తిరిగి ఇచ్చేస్తామని నమ్మించినా.. ఎట్టి పరిస్థితుల్లోనూ మీ మొబైల్ స్క్రీన్ లాక్ పిన్, పాస్‌వర్డ్ లేదా బ్యాంకింగ్ ఓటీపీలను ఫోన్‌లో చెప్పకూడదని వివరించారు.

ఎవరికి చెప్పుకుంటావో....

# చెప్పుకో!





డిఏపి అడిగితే డీలర్ వీరంగం
ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా మొండిచెయ్యి!
స్టాక్ ఉన్నా ఎందుకు ఇవ్వరని నిలదీసిన రైతులు
దుర్భాషలాడుతున్న వ్యాపారిపై ఆగ్రహం వ్యవసాయాధికారికి ఫిర్యాదు

**ధారూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** అన్నదాతల కష్టాలను ఆసరా చేసుకొని ఎరువుల వ్యాపారులు సాగిస్తున్న దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా ఎరువులు కేటాయిస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో డీలర్లు మాత్రం రైతులను బానిసల్లా చూస్తు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
ధారూర్ మండల పరిధిలోని మున్నూరు సోమారంలో ఉన్న అనంత పద్మనాభ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపు యజమాని అహంకార పూరిత తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దోర్నాల గ్రామానికి చెందిన రైతు మహిపాల్ తన పొలం అవసరాల కోసం ఆన్‌లైన్‌లో డిఏపి ఎరువును అధికారికంగా బుక్ చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో స్టాక్ అందుబాటులో ఉందని చూపడంతోనే ఆయన ఎరువుల కోసం ఆర్డర్ పెట్టాడు. ఆ తరువాత ఫోన్ ద్వారా ఎరువు ఇవ్వాలని కోరగా, సదరు యజమాని తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. ఆన్‌లైన్‌లో కనిపిస్తే మాకేంటి ఇస్తామని ఎక్కడ రాసి ఉంది ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో అంటు దుర్భాషలాడినట్లు రైతు మహిపాల్ ఆవేదన వ్యక్తంచేశారు.
ఫోన్ చేసి ఎరువు ఎప్పుడు ఇస్తారని అడిగితే నీచమైన భాషలో మాట్లాడి బెదిరింపులకు దిగడం పట్ల స్థానిక రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిబంధనలకు తుంగలో తొక్కుతు చివరికి అడిగిన హక్కును ప్రశ్నిస్తే బూతులు తిడుతున్న ఇలాంటి వ్యాపారుల లైసెన్సులు రద్దుచేయాలని తోటి రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయాధికారులు ఇప్పటికైన స్పందించి ఆ దురుసు డీలర్‌పై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# మురుగు లోనే... నడక



అసంపూర్తి పనులతో కాశవాడ రోడ్డు దుస్థితి

లాల్‌గడిమలక్ పేట్-కాశవాడ రోడ్డుపై మురుగు నీరు నిత్యం ఇంతే..

★ అరకొర బీటీ రోడ్డు..
★ వర్షం పడితే బురదమయం
★ వాహనదారులకూ తీవ్ర అంతరాయం
★ మున్సిపాలిటీగా మారినా.. మారని స్థానికుల తలరాత
★ ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా స్పందన శూన్యం
★ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్



గుంతల మయంగా మారిన కాశవాడ రోడ్డు

**శామీర్‌పేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంతో పాటు కాశవాడ కాలనీని కలిపే ప్రధాన రహదారి మురికికూపంగా మారింది. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామం నుంచి వచ్చే మురికినీరు దిగువ భాగంలో ఉన్న కాశవాడ కాలనీ రోడ్డుపైనే నిల్వ ఉండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో మురికినీటి దుర్వాసనతో పాటు డ్రైనేజీ ప్రవాహం మధ్య నుంచే కాలనీవాసులు, స్థానిక రైతులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా, ఇదే మార్గం ద్వారా జీనోమ్ వ్యాలీ బయోటెక్ పార్క్, పలు ఫార్మా కంపెనీలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు రోజువారీ వాహనాలపై ప్రయాణిస్తుంటారు. రోడ్డు కొంతదూరం సీసీగా, మరికొంత దూరం అరకొరగా బీటీ రోడ్డు వేసి వదిలేయడంతోపాటు గుంతలమయంగా మారడంతో స్వల్పంగా వర్షం కురిసినా రహదారి అంతా బురదమయంగా తయారవుతోంది.
గతంలో గ్రామపంచాయతీగా ఉన్న సమయం నుండి నేడు మున్సిపాలిటీగా మారినప్పటికీ తమ కష్టాలు తీరలేదని స్థానికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలోని దాదాపు 70 శాతం ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు ఈ రోడ్డుపైకే చేరుతోందని, సమస్య తీవ్రతపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఈ గ్రామం నుండి వైస్ చైర్మన్, నలుగురు కౌన్సిలర్లు ఉన్నప్పటికీ మురుగు సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్ స్పందించి, తగిన నిధులు కేటాయించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అమ్మా..సమస్యలు చెప్పండి ఢిల్లీకి వినిపిస్తా

ఎఐసిసి సెక్రటరీ అబ్జర్వర్ పివి మోహన్ - దళితవాడ వాసులతో మాటామంతీ

**మొయినాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ప్రజల గడప వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం కనకమామిడి దళితవాడను సందర్శించారు. కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ సెక్రటరీ అబ్జర్వర్ పీవీ మోహన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. రాఘమయి, పీసీసీ సెక్రటరీ శ్రీనివాస్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్‌తో దళిత కుటుంబాలను కలిసి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. రాఖీ పండుగను పురస్కరిం చుకుని దళిత మహిళలు పీవీ మోహన్ కు ఆప్యాయంగా రాఖీలు కట్టి.. తమ సమస్యలను కూడా సోదరుడి బాధ్యతగా పరిష్కరించాలని కోరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల ఆప్యా యతకు నేతలు ఆనందం వ్యక్తం చేసి, వారి సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పీవీ మోహన్ మాట్లా డుతూ.. అమ్మా...మీ సమస్యలు చెప్పండి.. మీ గళాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్తా. పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో మాత్రమే కాదని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రజలతో కలిసి నడిచే పార్టీ అని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిని పామెన భీమ్‌భరత్‌కే ఇవ్వా లని దళితవాడ ప్రజలు ఏకగళంతో కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు సాగు భూములు అందించిందని, ఎంతగానో మేలు చేసిందని గుర్తుచేసిన వారు.. ప్రస్తుతం తమ వాడలో నెలకొన్న సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా. రాఘమయి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళితవాడకు వచ్చిన నేతలకు కట్టిన రాఖీ.. ఒక పండుగ ఆచారం మాత్రమే కాదు, తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రజలు అందించిన ఆప్యాయతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మండలాధ్యక్షుడు బోలిగిద్ద సత్యానారాయణ, మాజీ అధ్యక్షుడు మాణయ్య, మండల ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# చార్మినార్ సాక్షిగా.. మిలాద్ వైభవం

నగరవ్యాప్తంగా ప్రవక్త జన్మదిన ఊరేగింపులు
ర్యాలీలో స్వయంగా సిపి సజ్జనార్
మత పెద్దలకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు





**చార్మినార్, ఆగస్టు26ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో బుధవారం మిలాద్-ఉన్-నబీ పండుగను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. మిలాద్- ఉన్-నబీ పండుగ సందర్భంగా చార్మినార్ జోన్ పోలీసులు పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మహ్మద్ ప్రవక్త జన్మ దినాన్ని పురస్కరించుకుని మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా ఖాద్రియా ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో కాజీపుర నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమై చార్మినార్ వద్ద ప్రధాన ర్యాలీలో కలిసింది. కాగా పాత నగరంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ఊరేగింపులు చార్మినార్ వద్ద ప్రధాన ర్యాలీలు కలిసాయి. పలు చోట్ల వేదికలు ఏర్పాటు చేసి ఊరేగిం పులకు స్వాగతం పలికారు. మిలాద్- ఉన్-నబీని పురస్కరించుకుని అన్న దానాలు, రక్త దాన శిబిరాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం వేలాది మంది ముస్లిం లు చార్మినార్ పరిసర ప్రాంతాలలో జరిగిన ర్యాలీలో పాల్గొనటంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. నగర పోలీస్ కమిషనర్ వి. సి.సజ్జనర్ పాతబస్తీని సంద ర్శించి చార్మినార్ వద్ద పోలీస్ అధికారులతో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. చార్మినార్ వద్ద ఊరేగింపులో పాల్గొన్నారు. మత పెద్దలను ఆత్మీయంగా పూల మాలతో సత్కరించి వారికి మిలాద్-ఉన్-నబీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



సర్వసభ సమావేశంలో మాట్లాడుతూన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**కుల్కచర్ల, ఆగస్టు 26,(ప్రభాతవార్త):** అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనిపరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ సమావేశానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.అయా శాఖల అధికారులు చేసిన అభివృద్ధి పనులపై వివరించారు. ఫారెస్ట్ అధికారుల తీరుపై పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య ఎమ్మెలే ముందే ఫైర్ అయ్యారు. పిరంపల్లి అడవి అధికారుల నిర్లక్ష్యానికి పూర్తి నాశనం అయిందని ఎన్ని ఎప్పుడు చెప్పినా స్పందించరని తెలిపారు.అడవి నాశనానికి కరణం ఫారెస్ట్ అధికారులే అని ఎమ్మెలకు తెలిపారు.దీంతో ఫారెస్ట్ అధికారులు తమ కార్యాలయాని మీరు రావాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సూచన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ..ప్రజలకుఅధికారులు,ప్రజాప్రతిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు,విద్యుత్,పారిశుద్ధ్యం,విద్య వైద్యం వంటి మౌళిక సమస్యలపై ప్రతేక దృష్టిసారించాలని సూచించారు. అనంతరం పటేల్చెరువు తాండ గ్రామ పంచాయతీకి బిటి రోడ్డు మంజూరు కోసంసర్పంచ్ శాంత తులసి రామ్ నాయక్, వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ భీంరెడ్డి,ఏఎంసి ఛైర్మన్ ఆంజనేయులు, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,తాసిల్దార్ పురుషోత్తం, ఎంపిడిఒ రామకృష్ణ ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నాపూర్‌లో గుర్తుతెలియని మహిళ మృతి

**జవహర్ నగర్,ఆగస్టు 26.ప్రభాతవార్త:** జవహర్‌నగర్ పోలిసు స్టేషన్ పరిదిలో చెన్నాపూర్‌లోని భాగ్యనగర్ కమాన్ సమిపంలో రోడ్డు పక్కన టెంటు కింద గుర్తుతెలియని మహిళ మృతదేహంలభ్యమైంది.బుధవారం మధ్యాహ్నం అటుగా వెళ్తున్న వ్యక్తి గమనించి పోలిసులకు సమాచారం ఇచ్చుడు.దీంతో పేట్రోలింగ్ పోలిసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 40నుంచి45 సంవత్సరాలు ఉంటుదని పోలిసులు తెలిపారు.ఆమె నాలుగు ఐదు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని,మృతదేహం కుళ్లిపోయిన స్తితిలో ఉన్నట్లు గుర్తించారు. ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్న ఆమే కొంతకాలంగా ఆప్రాంతంలో బిక్షాటన చేస్తు ఫుట్‌పాత్‌పై ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు.అయితె ఆమెపేరు,చీరునామా తదితర వివరాలు తెలియరాలేదు .మృతికి గల కారణం కూడా స్పష్టంగా తెలియలేదు.పోలిసులు కేసు నమేదు చేసి మృతురాలి వివరాలు తెలుసుకునేందుకు,మృతికి గల కారణాలను నిర్ధారించేదుకు దర్యాప్తు చేస్తున్నారు.

# తుర్కపల్లిలో ఎస్‌జిఎఫ్ జోనల్ స్థాయి క్రీడాపోటీలు

**శామీర్‌పేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**
సెప్టెంబరు 1నుంచి 3వ తేదీ వరకు ఉమ్మడి శామీర్‌పేట మండల 70వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు తుర్కపల్లిలోని విజేత టెక్నో స్కూల్ వేధికగా నిర్వహించటం జరుగుతుందని ఎస్‌జిఎఫ్ఐ శామీర్‌పేట జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి విజేత టెక్నో స్కూల్ వేధికగా జోనల్ స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలు (శామీర్‌పేట ఉమ్మడి మండల జోనల్ స్థాయి) జరగనున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబరు 1న వాలీబాల్, 2న ఖోఖో, 3న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో పోటీపడే వారు 1-1-2013తరువాత, అండర్-17విభాగంలో పాల్గొనే వారు 1-1-2010తరువాత జన్మించిన వారై ఉండాలని ఆయన సూచించారు. కబడ్డీ క్రీడాకారులకు బరువు నిబంధనలు వర్తిస్తాయని అన్నారు.
అండర్-14విభాగంలో 51కేజీలు, బాలికలు 48కేజీలలోపు ఉండాలని,అండర్-17విభాగంలో బాలురు 57కేజీలు, బాలికలు 55కేజీల బరువు పరిమితి దాటకూడదన్నారు. పోటీలలో పాల్గొనే పాఠశాలల విద్యార్థుల ఎలిజబిలిటి ఫారాలు, ఫోటోతో కూడిన సర్టిఫికెట్లను ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 12గంటలలోపు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూంకుంటలో సమర్పించాలని ఆయన సూచించారు. ఎలిజబిలిటి ఫారాలు సమర్పించని వారు టీమ్‌లను పోటీల్లో అనుమతించబడదన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1గంటలకు టీమ్‌ల డ్రాలు తీయబడుతాయని జోనల్ క్రీడా కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9849416773నెంబరుకు ఫోన్‌లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

## నేడు అవుషాపూర్‌లలో గ్రామసభ

**ఘట్‌కేసర్, ఆగష్టు 26, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించి గురువారం అవుషాపూర్‌లో గ్రామసభ/వార్డు సభ నిర్వహిస్తున్నట్లు ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఓటర్ల జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో మార్పులు/సవరణలు, తొలగింపులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించబడుతుందని చెప్పారు. ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై, తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు ఉంటే అధికారులకు తెలియజేయయాలని ఆయన సూచించారు.

## ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ జమామస్జీదు ఆవరణలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జల్సా కార్యక్రమం నిర్వహించారు. ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన జీవితాన్ని, బోధనలను, మానవత్వం, కరుణ, ప్రేమ, సోదరభావం వంటి విలువలు స్మరించుకుంటూ ముస్లీం సోదరులు పండుగను జరుపుకున్నారు. ఘట్‌కేసర్, అవుషాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, అంకుశాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్‌లో ప్రార్థణా మందిరాలను, మస్జీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముస్లీం సోదరులు పలు చోట్ల పేదలకు ధానధర్మాలు చేశారు. ఈకార్యక్రమంలో జామా మస్జిద్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్‌అజీజ్, కార్యదర్శి కుతుబుద్దీన్, అష్రఫ్, సల్మాన్, ఎండి సిరాజ్ పాల్గొన్నారు.

## నేడు ఎస్ఐఆర్ కార్యక్రమం గ్రామసభ

**ఘట్‌కేసర్, ఆగష్టు 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ పాత గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 11 గంటలకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ తెలిపారు.
గ్రామసభలో ఓటరు జాబితా ధృవీకరణ, ప్రతిఒక్కరి ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం, ఎస్ఐఆర్-2026కు సంబంధించిన అంశాలపై చర్చలు, ప్రజల సందేహాలను అధికారులు హాజరై నివృతి చేస్తారని తెలిపారు. ఎదులాబాద్, ఘణాపూర్, మర్రిపల్లిగూడ ప్రజలు, అర్హులైన ఓటర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

## రేపు గోదాదేవి గరుడసేవ

**ఘట్‌కేసర్, ఆగష్టు 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో శుక్రవారం శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త టీపీ పవన్‌కుమారాచార్యులు తెలిపారు. శ్రావణమాసం పౌర్ణమి శుక్రవారం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు గరుడ సేవ, 7 గంటలకు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ఈదివ్యమైన రోజు గరుడ సేవను వీక్షించడం మన అదృష్టంగా భావించాలని భక్తులు 6 గంటలవరకు వచ్చి అమ్మవారికి జరిగే ప్రత్యేక ఉత్సవాన్ని తిలకించవలసిందిగా ఆయన కోరారు.


# 22ఎ భూముల జాబితాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: టిఆర్‌ఎస్ నేత మారయ్య

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26 ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నివసించే నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ప్రభుత్వం 22ఎ భూములపేరిట ఆటలాడుకుంటుందని తెలంగాణ రక్షణ సమితి(టిఆర్ఎస్)కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎత్తరి మారయ్య ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పార్టీకార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి లో ప్రభుత్వం 22ఎ జిఓ ప్రాంతాలను, సర్వేనెంబర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. ఈవిష యంలో ప్రజల హాక్కులకు ఎలాంటి భంగం జరిగినా సహించేదిలేదని హెచ్చరించారు. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చేముందు సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన భూహాక్కుదారులను న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కుత్బుల్లాపూర్‌కు సంబందించి ప్రభుత్వ రికార్డులలో 22ఎక్రింద నిషేధితం గా పేర్కొన్న భూములపై ప్రజల్లో అనేక సందేహాలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. 22ఎక్రింద ప్రస్తు త భూహాక్కుదారులు ఎవరనేది పూర్తిగా సమాచా రం ఇ వ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. ప్రస్తుతం ఆయాభూము లకు హక్కుదారులు ఎవరు?,ఏ కారణంతో వాటిని 22ఎ జాబితాలో చేర్చాల్సి వచ్చిందనే అంశంపై ప్రభుత్వం వెం టనే స్పష్టత ఇవ్వాలని ఎత్తరి మారయ్య డిమాండ్ చేశారు..

**భూమే కుటుంబ జీవనాధారం**

ప్రస్తుతం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధిలోని భూములు పేదప్రజల ఆస్తిమాత్రమేకాదని అది కుటుం బాలకు జీవనాధారమని గుర్తుచేశారు. 22ఎ జిఓక్రింద నిషేధిత జాబితాకారణంగా రిజిస్ట్రేషన్, వారసత్వ బదలా యింపు, బ్యాంక్ ఋణాలు వంటి చట్టబద్ధమైన వ్యవహా రాలతో కుటుంబాలకు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం పై బాధ్యులు ఎవరని ప్రశ్నించారు.

## పాతబస్తీలో భక్తిప్రపత్తులతో మిలాద్ ఉన్ నబీ



జులూస్‌కు స్వాగతం పలుకుతున్న ముస్లీం పెద్దలు

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** పాతబస్తీ వ్యాప్తంగా మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని బుధవారం భక్తిప్రపత్తులతో సాంప్ర దాయబద్ధంగా జరుపుకున్నారు. ఉదయం నుండి కొత్త దుస్తులు ధరించి సమీపంలోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలిపుకున్నారు. ప్రతి బస్తీ నుండి ములాద్ జులూస్‌లు నిర్వహించారు. వాహనాలపై సాంప్రదాయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. పలు కూడళ్ళ వద్ద షర్బత్, ఖీర్, పూరిలను భక్తులకు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. మతపెద్దలు ప్రత్యేక వేదికల నుండి జులూస్‌లకు స్వాగతం పలికారు. మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ కన్వీనర్ డాక్టర్ హాఫేజ్ ముజఫర్ హుస్సేన్ ఖాన్, అధ్యక్షులు మౌలానా కమల్ పాషా షతా రీల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ర్యాలీ భారీ జులూస్‌గా మారి చారిత్రక చార్మినార్, మక్కా మసీ దు వద్దకు చేరుకుంది. మిలాద్ ఉన్ నబిని పురస్కరిం చుకొని మసీదులు, దర్గాలను, బస్తీలను, కూడళ్ళను రంగుల విద్యుత్ దీపాలు, అలంకరణ సామాగ్రితో శోభాయమానంగా అలం కరించారు. అలియాబాద్ శంషీర్‌గంజ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుండి హాఫీజ్ షేక్ ఫేరోజ్ నక్షాబంది, సయ్యద్ ఇమ్రాన్ ఖాద్రి, గులామ్ బిలాల్, సయ్యద్ గౌస్, మహ్మద్ సలీమ్, మహ్మద్ ఖలీమ్, మహ్మద్ సమీర్, సయ్యద్ సలీమ్, ఇ ల్యాస్ నవాబ్‌లు మిలాద్ జులూస్‌కు స్వాగతం పలికారు.

## నేటి నుండి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

**చిక్కడపల్లి ఆగస్టు 17 ( ప్రభాతవార్త ) :**
ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం, శ్రీ పంచముఖ ఆంజనేయ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 30 వరకు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి కళావిఎస్ జనార్ధనమూర్తి సోమవారం తెలిపారు.27 న సాయంత్రం ఆరు గంటలకు విష్ణుసహస్రనామ పారాయణ, విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, రక్షా బంధన, ఋత్విక్వరణ ము, మృత్సంగ్రహణ, అంకురార్పణ, తీర్థప్రసాద గోష్ఠి, 28 న సుప్రభాతం, విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, మహాకుంభ ఆరాధన, అగ్నిప్రతిష్ఠాపన హోమము, పవిత్ర అధివాసం, లఘు పూర్ణాహుతి, మంగళనీరాజనం. సాయంత్రం 6.00 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణ, కుంభారాధన, మూలమంత్ర హోవ నము, స్వామివారికి పవిత్ర సమర్పణ ఉంటాయన్నారు. 29 న సుప్రభాతం, కుంభ ఆరాధన, మూలమంత్ర హోవనము, "శ్రీవారి శాంతి కల్యాణం", వేద ఆశీర్వచనము, అన్న సమారాధన. సాయంత్రం 6.00 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణ, శ్రీమహాలక్ష్మీ హోమము, లఘు పూర్ణాహుతి, 30 న సుప్రభా తసేవ, మహాకుంభారాధన, శ్రీమహాసుదర్శన లక్ష్మీ నరసింహ హోమము, మహా పూర్ణాహుతి, కుంభాప్రోక్షణ, శ్రీ వెంకటేశ్వర స్వామివారికి పంచామృత స్నపనము, విశేష అలంకరణ. స్వామివారికి లక్ష తులసీ పూజ, తీర్థప్రసాద గోష్ఠి ఉంటుందని, భక్తులు ఈ పవిత్రోత్స వాల్లో పాల్గొనాల్సి ందిగా సీఈఓ పి.ఎ. మురళి, ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి కోరారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో కార్పొరేట్‌కు ధీటుగా సేవలు

**అప్జల్‌గంజ్,ఆగస్టు 26ప్రభాతవార్త:**
చర్మవ్యాధుల చికిత్స కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖర్చుతో కూడు కున్నది.కానిఉస్మానియా ఆసుపత్రిలో ఖరీదైన శస్త్రచికిత్సలు, అంటు వ్యాధులు,సుఖవ్యాధులు,వంటి క్లిష్టమైన వ్యాధులకునిష్ణాతులైన వైద్య నిపుణులు ఉచితంగా వైద్యసేవలు అందచేస్తున్నారు.అత్యాధునిక సదు పాయాలతో తీర్చిదిద్దినఆపరేషన్ థియేటర్,పరిశోధనా కేంద్రాన్ని ఆసుపత్రి సూపరిండెంటెంట్ రాకేష్‌సహాయ్, చర్మవ్యాధుల విభాగం అధిపతి డాక్టర్ భూమేష్‌కుమార్, ఉస్మానియా మెడికల్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావుతో కలిసిరాష్ట్ర వైద్యసంచాలకురాలు డాక్టర్,ఎన్.వాణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలోఏర్పాటు చేసిన ఈ విభాగంలో అత్యాధునిక లేజర్లు,అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.వీటిలో స్వీచ్‌న లేజర్,యాగ్‌లేజర్,డయోడ్ సంక్రమి ంచే(సుఖవ్యా ధులు)ఇన్‌పెక్షన్ల సమగ్ర వైద్య సేవలు అందచేయడం జరుగుతుం దన్నారు.

# సెప్టెంబర్ 6న మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్ పోటీలు

**-గోడప్రతులను ఆవిష్కరించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్**



బాడీ బిల్డింగ్ పోటీల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్

**ముషీరాబాద్, ఆగస్ట్ 26, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 6న తెలంగాణ సిటీ కార్యాలయంలో ఎన్టీఆర్ మెమోరియల్ బాడీ బిల్డింగ్ మెన్స్ ఫిజిక్ జూనియర్స్ అండ్ ఓపెన్-మిస్టర్ తెలంగాణ 2026 పోటీలు నిర్వహించనున్నట్లు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం టీడీపీ సిటీ కార్యాలయంలో గోడ ప్రతులను ఆయన టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లతో కలసి ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలలో విజేతలకు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరిట మరియు ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మెన్స ఫిజిక్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పేరిట బహుమ తులు, నగదు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. తెలం గాణ ఏర్పడిన నాటి నుంచి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు సైతం చాక్లెట్లు, బిస్కెట్ల రూపంలో మత్తు పదార్థాలు అమ్ముతు న్నారని, దీనిపై డీజీపీని కూడా కలసి, దీనిపై సమగ్ర నియంత్రణ వ్యవస్థ తీసుకురావాలని టీడీపీ డిమాండ్ చేసినట్లు, అనంతరం ముఖ్యమంత్రితో సమావేశమై మ త్తు పదార్థాలు లభించిన పాఠశాలల లైసెన్స్‌లు రద్దు చేసే విధానాన్ని ప్రభుత్వం ప్రకటించినట్లు ఆయన గుర్తు చేశారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకే బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్యాం సుందర్, కరణం కిరణ్, భానుప్రకాష్, భవాని శ్రీనివాస్, వై.ఎల్. నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## తప్పిపోయిన బాలుడిని సురక్షితంగా తండ్రికి అప్పగింత

**పేట్ బషీరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** సుభాష్‌నగర్ ప్రాంతంలో తప్పిపోయిన నాలుగేళ్ల బాలుడిని పేట్ బషీరాబా ద్ పోలీసులు సకాలంలో గుర్తించి, అతని తల్లిదం డ్రులను సంప్రదించి సుర క్షితంగా అప్పగించారు. పోలీసుల చొరవతో బాలుడు క్షేమంగా తండ్రి వద్దకు చేరడం తో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.
సీఐ విజయ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సుభాష్‌నగర్ ప్రాంతంలో నా లుగేళ్ల బాలుడు తప్పిపోయిన విషయం పోలీ సుల దృష్టికి వచ్చింది. బాలుడు ఒంటరిగా కనిపించడంతో పేట్ బషీరాబాద్ పోలీసులు వెంటనే స్పందించి బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడి వివరాలు తెలుసు కునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో పాటు అతని ఫోటో ను స్థానికులు, ఇతర పోలీస్ స్టేషన్లకు సంబంధించిన వివిధ సమాచార సమూ హాల్లో విస్తృతంగా పంపించారు. పోలీసులు పంపిన సమాచారాన్ని చూసిన బాలుడి తండ్రి వెంటనే పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.
అక్కడ ఉన్న బాలుడిని చూసి తన కుమారుడిగా గుర్తించారు. అనంతరం పోలీసులు తగిన వివరాలను నిర్ధారించి బాలుడిని అతని తం డ్రికి సురక్షి తంగా అప్పగించారు.
చిన్నారుల భద్రత విషయంలో పోలీసులు చూపిన అప్రమత్తతకు ప్రశంసలు వెల్లువెత్తాయి.

## నాలాలో పడి కొట్టుకుపోయిన బాలయ్య ఆచూకి ఎక్కడ : వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్



నాలాలో కొట్టుకుపోయిన బాలయ్య కుటుంబాన్ని పరామర్శించిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

**శేరిలింగంపల్లి, అగస్టు 26 ప్రభాతవార్త**
ప్రమాదవశాత్తు నాలాలో పడి కొట్టుకుపోయిన బాలయ్యను ఇప్పటి వరకు గుర్తించకపోవడం దారుణమని తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి నియోజక వర్గ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. హాఫీజ్‌పేట్ డివిజన్ ప్రేమ్‌నగర్ కాలనీ వాసి బాలయ్య జూలై 28వ తేదిన కురిసిన భారీ వర్షానికి ప్రమాదావశాత్తు నాలాలో పడి కొట్టుకుపోయిన బాలయ్య ఆచూకి లభించకపో వడంతో టీఆర్ఎస్ నేత వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ బాల య్య సతిమణి గృహానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు నాలాలో కొట్టుకుపోయిన బాలయ్య ఆచూకి లభించలేదని, సకాలంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యిందన్నారు. అదే ఒక ప్రజాప్రతినిధి కానీ, వారి బంధువులు కానీ, డబ్బున్న వ్యక్తులు కాలనీ ప్రమాదవశాత్తు నాలాలో పడిపోతే ఇదే విధంగా వ్యవహరిస్తారాయని ప్రశ్నించారు. పేద వారికి ఒక న్యాయం,డబ్బున్న వారికి ఒక విధంగా చూడటం, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అంటే ఇదేనా అంటూ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే గాంధీ ప్రభుత్వం తరపున బాలయ్య కుటుంబానికి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, పద్మకు డబుల్ బెడ్ రూం కెటా యించటంతో పాటు ఆమెకు ప్రభుత్వం తరపున 50లక్షల రూపాయల నష్టపరిహారం చెలి ్లంచాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో చందానగర్ డివిజన్ పీజేఆర్ రోడ్డులో శ్రీకాంత్‌రెడ్డి నాలాలో పడి చనిపోతే వారికి కుటుంబ సభ్యులకు లక్షా,ఏభైవేల రూపాయల ఆర్థిక సాయం చేయటం ద్వారా వారి కుటుంబాన్ని ఆదుకోవడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. కాగా శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున ఇచ్చిన ఏ హామీ నెరవేరలేదన్నారు. నాలాల చుట్టూ ప్రభుత్వం పటిష్టమైన కంచెలు వేసే చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిదులుస్పందించి నాలాల చుట్టూ పటిష్టమైన కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలయ్య సతీమణి పద్మ కు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాలయ్య కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.

## సురారం పోలీస్ స్టేషన్‌లో సైబరాబాద్ సిపి ఆకస్మిక తనిఖీ



శాంతిభద్రతల పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

**జీడిమెట్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త**
సైబరాబాద్ పోలీస్ కమిషనర్ బుధవారం సురారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని శాంతిభద్రతల పరిస్థి తిని సమీక్షి ంచారు.స్టేషన్‌లో విధు లు నిర్వహి స్తున్న ఎస్ఐలు, రిసెప్షన్ సిబ్బంది, వివిధ విభా గాల ఇన్‌చార్జీలతో కమిషనర్ మాట్లాడి వారి విధు ల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, విధుల నిర్వహ ణకు సంబంధించిన పలు అంశాలను సమీక్షించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, పెండింగ్ కేసులను త్వరితగతిన పరి ష్కరించేందుకు అవసరమైన చర్య లు తీసుకో వాలని సిబ్బందికి సూచించారు.



ఆరోగ్యనగర్‌లో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి.

## పేదల పెన్నిది.. నిరుపేదల అమ్మ మదర్ థెరిస్సా

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 26, ప్రభాతవార్త :**
పేదల కోసం తమ జీవితాన్ని అంకితం చేసి సేవాతత్పరతతో ముం దుకు వెళ్లిన గొప్ప మహోన్నత వ్యక్తి సెయింట్ మదర్ థెరిస్సా అని బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి అన్నారు. బుధవారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్యనగర్‌లో సెయింట్ మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె స్మృతి వనంలో మదరత్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్ థెరిస్సా పేద వారికి సేవలు చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసినందుకు మిషనరీ ఆఫ్ చారిటీని 1950లో కోల్‌కతాలో స్థాపించారు. ప్రస్తుతం 130కి పైగా దేశాల్లో వేలాది కేంద్రాలు నెల కొల్పబడ్డాయని అన్నారు. కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తుల కోసం ఆశ్రమా లు, అనాథ శరణాలయాలు, పాఠశాలలను నెలకొల్పారని 1979లో మానవతా సేవకు గాను నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యనగర్ అధ్యక్షులు మారినేని విజయ్ చిరంజీత్, వంశీ, విష్ణు, కరణ్ సింగ్, మహేష్ యాదవ్, మారినేని అక్షయ్, మారినేని అఖిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

# బడి స్థలాన్ని అమ్మేస్తే ఊరుకోం

**-టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**



ఆంధ్రా ప్రాథమికోన్నత పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న స్థానిక కాలనీవాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

**చిక్కడపల్లి ఆగస్టు 26 ప్రభాతవార్త :** బాగ్ లింగంపల్లిలోని ఆంధ్రా ప్రాథమికోన్నత పాఠశాల కు కేటాయించిన స్థలాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు వాణిజ్య అవసరాల కోసం వేలం వేసి విక్రయించేందుకు యత్నించడాన్ని స్థానిక కాలనీవాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బుధవారం అడ్డుకున్నారు. బోర్డు తీరుకు నిరసనగా బుధవారం పాఠశాల ఆవరణ వద్ద స్థానికులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా కాలనీవా సులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పూర్వం కాలనీ లేఅవుట్ ఏర్పాటు చేసిన సమయంలో పేద, దిగువ మధ్యతరగతి ప్రజల పిల్లల చదువుల కోసం 500 చదరపు గజాల స్థలాన్ని ప్రత్యేకంగా పాఠశాల కోసం కేటాయించారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎల్.ఐ.జి, ఎం.ఐ.జి కాలనీలతో పాటు సూర్యనగర్, సంజయ్ నగర్, తదితర బస్తీలకు చెందిన పేద ప్రజలే ఎక్కువగా నివసిస్తున్నారని, వారందరి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేం దుకు ఈ ప్రభుత్వ పాఠశాలే ఏకైక ఆధరణ అని పేర్కొన్నారు. అటువంటి పవిత్రమైన బడి స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు, కళాశాలలకు టెండర్ల ద్వారా విక్రయించి లాభపడాలని హౌసిం గ్ బోర్డు చూడటం అత్యంత అన్యాయమని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు, కాలనీ నాయకులు ప్రధానంగా పలు డిమాండ్లను ప్రస్తావించారు. హౌసింగ్ బోర్డు అధికారులు వెంటనే ఈ వేలం టెండర్లను రద్దు చేయాలని, ఆ స్థలాన్ని పూ ర్తిస్థాయిలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, పాఠ శాల నూతన భవన నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డి , హౌసింగ్ బోర్డు మంత్రిని కలసి పరిస్థితిని వివరిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే హౌసింగ్ బోర్డు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఆందోళనలను తీవ్రతరం చేయడంతో పాటు, తెలంగాణ హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. బడి స్థలాన్ని విక్రయించేందుకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్లు, స్థానిక నాయకులు సురేష్, జగన్, బస్తీల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త**
నల్లకుంట విద్యానగర్‌లోని హజరత్ సయ్యద్ అలీ ఉల్లా షా ఖాద్రి కిష్టి బందా నవాజ్ దర్గాలో బుధవారం మిలాద్ ఉన్ నబీ వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత అమర్‌నాథ్ గౌడ్ పాల్గొ న్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మించిన పవిత్ర దినం ముస్లిం సోదరులకు ఎంతో విశిష్టమైనదని అన్నారు. మిలాద్ ఉన్ నబీ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షి ంచారు.గంగిశెట్టి లిఖిత గౌడ్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, ధర్మబద్ధమైన జీవన విధానం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రా యమని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు మహబూబ్ ఖాన్, అబ్దుల్ జబ్బార్, అబ్దుల్ ఖలీం, సయ్యద్ ఖాజా మునీర్ ఉద్దీన్, షేక్ ఆసిఫ్ అలీ, షేక్ అన్సర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేడి ప్రసాద్, భాస్కర్ గౌడ్, నైతిక్ గౌడ్, విజయ్ సాగర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ప్రేమ్‌నగర్‌లోని ఎస్ఆర్‌జీ ఫంక్షన్ హాల్‌లో మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా నిర్వహించిన రక్తదా న శిబిరానికి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, డీసీపీ నర్స య్య, సీఐ కిరణ్‌కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అభినందించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులని పేర్కొన్నారు.మిలాద్‌ఉన్‌నబీ సంద ర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సామాజిక సేవా స్ఫూ ర్తిని చాటిందని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా మిలాద్ ఉల్ ఉన్ నబీ వేడుకలు

**చేవెళ్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :** అన్న చివేతకు గురైన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ అభయాసం పేరుతో అమలు చేస్తామని చెప్పిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బొంకూరి సురేందర్ సన్ని కండెల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల లోని కె.వి.ఆర్ గార్డెన్ లో మైదానంలో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించిన దళిత, గిరిజన,ఆదివాసి జె. ఎ. సి నాయకులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేవెళ్లలో భారీ బహిరంగసభను ఏర్పాటు చేసి తెలంగాణలోని దళిత, గిరిజన, ఆదివాసి ప్రజలను అభివృద్ధి చేస్తామని చెప్పారని, అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతి ఎస్సీ,ఎస్టీ కుటుంబానికి రూ.12లక్షలను అందిస్తామన్నారన్నారు. మూడు ఎస్సీ కార్పొరేషన్ లను అందిస్తామని, ఎస్టీ లకు మూడు కార్పొరేషన్ లను ఏర్పాటు చేస్తామని 12అంశాలతో కూడిన వాగ్దానలను 2023న చేవెళ్లలోని కె వీ ఆర్ గ్రౌండ్ లో మల్లికార్జున కర్గే, రేవంత్ రెడ్డి, దామోదర రాజ నర్సింహా, మల్లు బట్టి విక్రమార్క, సంపత్ కుమార్, బెల్లయ్య నాయక్, నాగరిగారి ప్రితం ప్రకటించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి మంత్రి వర్గ సమావేశం లోనే అమలు పరుస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఇచ్చి నేటికీ మూడు సంవత్సరం లు అవుతున్నప్పటికి హామీలను అమలు పరిచడంలో నిరక్ష ్యం వహిస్తున్న తీరుకు నిరసనగా ఇదే గ్రౌండ్ లో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు ఇప్పటికైనా పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన,ఆదివాసి జె. ఎ. సి నాయకులు బొంగు వెంకటేష్ గౌడ్ కండెల పెద్ద వెంకటేష్ మద్దెల భవాని కళ్లేపల్లి రవి వనం గంగయ్య మిట్టపెల్లి రాధిక వనం పుల్లయ్య మిక్కిలి సుంకయ్య జగన్నాధం మహేష్ జగన్నాధం శేఖర్ మ్యారడి అంజయ్య వనం కావేరి వనం లలిత వనం పద్మ మద్దెల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కె.వి.ఆర్ మైదానంలో మాట్లాడుతున్న దళిత గిరిజన ఆదివాసి జేఏసీ నాయకులు

# రైతు ఋణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయండి

-సన్నరకం పంటకు బోనస్ ఇవ్వాలని వినతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఋణమాఫీ అమలు కాని రైతులకు విచారణ జరిపి పూర్తి స్థాయిలో చేయాలని జిల్లా రైతు సమాఖ్య నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లేఖ ద్వారా కోరారు. ఈమేరకుహైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డిని కలిసి రైతుల సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు ముద్దం సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి జగన్నాధం, గౌరవ అధ్యక్షులు వంగ పెంటారెడ్డి, సభ్యులు చిన్నారెడ్డిని కలిశారు. రూ.2 లక్షల లోపు పంట ఋణాలు పొందిన వారికి ఋణమాఫీ జరిగినా కొంత మంది రైతులకు నష్టం జరిగిందని బ్యాంకు అసలు, వడ్డీ కలిపి రెండు లక్షల రుపాయలు కావడంతో అమలు కాలేదని తెలిపారు. మేడ్చల్ జిల్లాలో రైతులు వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార సంఘం బ్యాంకులో 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు పంట ఋణాలు తీసుకున్నారని తెలిపారు. ఆధార్‌కార్డులలో పేర్లు తప్పుగా నమోదు కావడం, జాబితా ఆలస్యంగా పంపడం వల్ల ఋణమాఫీ కాలేదని, కుటుంబలో ఇద్దరికి పంట ఋణాలు ఉంటే ఒక్కరికి కూడా ఋణమాఫీ కాలేదని తెలిపారు. ఋణమాఫీ చేయాలని పలుసార్లు బ్యాంకు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని రైతులు ఋణమాఫీ కోసం ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఋణమాఫీ కాక రైతులు వడ్డీవ్యాపారుల వద్ద తీసుకున్న అప్పులు తీర్చలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సన్నవడ్ల బోనస్ క్వింటాల్‌కు రూ.500లు యాసంగి పంటలకు సంబంధించి గత, ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు రాలేదని పేర్కొన్నారు. వానాకాలం పంటకు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని వ్యవసాయాధికారులు 7 రకాల వడ్లకకు మాత్రమే బోనస్ వస్తుందని అంటున్నారని అన్ని రకాల వడ్లకు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.


చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా రైతు సమాఖ్య నాయకులు

# షాబాద్‌లో భక్తిశ్రద్ధలతో మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు


షాబాద్‌లో మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

**షాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు బుధవారం షాబాద్ లో మిలాద్ ఉన్‌నబీ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు ప్రవక్త మహమ్మద్ బోధనలు, ఆయన చూపిన ప్రేమ, కరుణ, శాంతి, సోదరభావం, మానవతా విలువలను వివరించారు. మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా పలుచోట్ల మిలాద్ మహ్‌ఫిల్‌లు, సీరత్ సమావేశాలు నిర్వహించి ప్రవక్త మహమ్మద్ జీవిత విశేషాలను, మానవాళికి ఆయన అందించిన సందేశాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలో మిలాద్ ఊరేగింపులు నిర్వహించారు. ఈ పర్వదినం ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత, మానవతా విలువలను పెంపొందించాలని మత పెద్దలు ఆకాంక్షి ంచారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. మత సామరస్యం, శాంతి, సోదరభావం వెల్లివిరిసేలా పండుగను నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన సత్ప్రవర్తన, దయ, సేవాభావం ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు మతిన్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఇబ్రహీం, యూసుఫ్, ఆరిఫ్, ఎంజి ఇమ్రాన్, డాక్టర్ ఇమ్రాన్, మూర్తజ, అక్తార్ ఖాన్, యూసుబ్, ముక్రమ్ ఖాన్, సోయల్ ఖాన్, ఇమ్రాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పిఆర్టియుటిఎస్ కొడంగల్ మండల నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన పిఆర్టియుటిస్ మండల నూతన కమిటీ

**కొడంగల్,అగష్టు 26,ప్రభాతవార్త:**
కొడంగల్ మండల పిఆర్టియుటిఎస్ కొడంగల్ మండల నూతన కమిటీ అధ్యక్షులుగా అబ్దుల్‌హక్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. బుధవారం కొడంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రోగ్రసివ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణా స్టేట్(పీఆర్టీయూటీఎస్) కొడంగల్ మండల కమిటీ కొత్త కార్యవర్గం మండల సారాధరణ సభలో ఏకగ్రీవంగా ఎన్నికైంది.ఈ మండల సాధారణ సభ కార్యక్రమానికి పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు కే.చంద్రశేఖర్,జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అమర్‌నాధ్ హాజరై నూతన కమిటీని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎంఈఓ రాంరెడ్డి,కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్,జీహెచ్ఎంలు మురళీధర్,రాములు,రాష్ట్ర యూనియన్ సభ్యులు ఆర్.అనంద్‌రావు,ఎం.వెంకటేశం,వెంకటయ్య,జిల్లా యూనియన్ సభ్యులు మహేందర్‌సింగ్,వైఎస్,గీత,జ్యోతి పాల్గొన్నారు.టీఎస్‌జీఆర్ఈఏ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ,కే.యాదగిరి తదితరులు పాల్గొని కొత్త కమిటీకి అభినందలు తెలిపారు.ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో మరింత చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అమర్‌నాధ్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి,విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని నూతన కమిటికి సూచించారు.అనంతరం పీఆర్టీయూ మండల అధ్యక్షులుగా అబ్దుల్‌హక్,ప్రధాన కార్యదర్శిగా టి.దినేష్‌సింగ్,సహ అధ్యక్షులుగా గోపాల్‌రెడ్డి,మహిళా సహ అధ్యక్షులు ఎం.మహేశ్వరీ,ఉపాధ్యక్షులుగా బస్వంత్,నైమత్,మహిళా ఉపాధ్యఓఉరాలుగా ఇ.రజిత,కార్యదర్శులుగా చంద్రశేఖర్,అబ్దుల్ కలీం,రాఘవేంద్రప్రసాద్,భరత్‌కుమార్,మహిళా కార్యదర్శులుగా జి.జ్యోతి,జయభారతిలు ఎన్నికైయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు అబ్దుల్‌హక్,ప్రధాన కార్యదర్శి టి.దినేష్‌సింగ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణ,విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యా ప్రమాణాలు,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని,అందుకు మండలంలోని సమస్త ఉపాధ్యాయుల సహకారం కోరారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మత సామరస్యంతోనే సమాజ అభివృద్ధి: ఎమ్మెల్సీ

**కొత్తూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, కరుణ, సోదరభావం సర్వమానవాళికి ఆదర్శమని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారంమిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తూరు మండలంలోని ప్రసిద్ధ జహంగీర్ పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి హాజరై ముస్లిం మత పెద్దలతో కలిసి దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక దువా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ బోధించిన కరుణ, దయ, ప్రేమ, శాంతి, సోదరభావం వంటి విలువలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శనీయమని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరింత విలసిల్లాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రజలందరిలో ప్రేమ, శాంతి, ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజు, రషీద్, నవాజ్, డీలర్ కుమార్, శివచారి, అయూబ్ తదితర మైనారిటీ నాయకులు, మత పెద్దలు, తదితరులు


జహంగీర్ పీర్ దర్గా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

# శంషాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం

**శంషాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త :** తీసుకున్న అప్పులు చెల్లించలేక ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యమైన ఘటన శంషాబాద్ ఫ్యూచర్ సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. పెద్దషాపూర్ గ్రామానికి చెందిన గుల్లా నవీన్ కుమార్ (29)రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో జ్యోతి, అనురాధ అనే అక్కాచెల్లెళ్ల వద్ద తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించలేకపోయాడు. వారు తమ బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి కూడా నవీన్‌కు డబ్బులు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పులో కొంత మొత్తాన్ని నవీన్ సోదరి చెల్లించడంతో పాటు బ్యాంకులో ఉన్న బంగారాన్ని కూడా విడిపించినట్లు తెలిపారు.అయితే ఈ నెల 25న జ్యోతి నవీన్ మొబైల్‌కు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని కోరినట్లు పోలీసులు తెలిపారు.

తన వద్ద ప్రస్తుతం డబ్బులు లేవని నవీన్ చెప్పినప్పటికీ వారు పట్టుబట్టడంతో మనస్తాపానికి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అదే రోజు సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో నవీన్ తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి, పని ఉందని చెప్పి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను విచారించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అతని సోదరి గుల్లా రావళి పోలీసులను ఆశ్రయించింది.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# వెల్జాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**తలకొండపల్లి ఆగస్టు 26, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం నాడు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పల పల్లి, పడకల్ గ్రామాల్లో నీ ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించి దర్గాలో పూలు సమర్పించుకుని పాత్యాలు ఇచ్చారు. మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు హారీఫ్, అజీజ్, కాజా పాషా, సుభాన్ నయీమ్ గౌస్ కజమనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


వెల్జాల్లో వేడుకలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి

- బిఆర్ఎస్వి శంషాబాద్ మండలం జనరల్ సెక్రెటరీ రాఘవేందర్

**శంషాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని బీఆర్ఎస్‌వీ శంషాబాద్ మండల జనరల్ సెక్రటరీ మల్లిగొల్ల రాఘవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే నిలిచిపోతున్నాయని, దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు వారు దూరమవుతున్నారని అన్నారు.పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై కూడా ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను శక్తి స్కీమ్‌లోకి తీసుకురావడంపై విద్యార్థుల్లో ఆందోళన ఉందని, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సమగ్రంగా పరిష్కరించాలని, గురుకులాలు, విద్యాసంస్థల్లో భద్రత, నాణ్యమైన ఆహారం, విద్యా సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, నిలిచిపోయిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదు. విద్యార్థుల పక్షాన మా పోరాటం కొనసాగుతుందని, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాఘవేందర్ హెచ్చరించారు.


పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేస్తున్న చైర్ పర్సన్ రజిత వెంకటేష్

# పారిశుధ్య కార్మికులకు భరోసా

పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్

**పరిగి, ఆగష్టు26, ప్రభాతవార్త :**

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే పారిశుధ్య సిబ్బందికి అన్నివిధాల అండగా ఉంటామని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు.బుధవారం, తెల్లవారుజామున మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పనితీరును రజితవెంకటేష్ పరిశీలించారు. పట్టణంలోని పారిశుధ్య నిర్వహణ, సిబ్బంధి హాజరు, సమస్యలపై చైర్ పర్సన్ సమీక్షి ంచారు.కార్మికులతో వారు మాట్లాడుతూ...పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంఛాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై చెత్త, నీరు నిల్వ ఉండకుండా వెంటనే తొలగించాలని అన్నారు..డ్రైనేజి, కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని,పట్టణ ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని సూచించారు..కార్మికుల సమస్యలను పరిష్కరించి , భరోసా కల్పిస్తామని రజితవెంకటేష్ తెలిపారు.

# మిలాద్ ఉల్ ఉన్ నబీ వేడుకల్లో సేవాభావాన్ని చాటుకున్న మైనార్టీలు

**చేవెళ్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మిలాద్ ఉల్ ఉన్ నబీ" సందర్భంగా "మహమ్మద్ ప్రవక్త" చూపిన ప్రేమ, కరుణ, మానవతా మార్గంలో అడుగులు వేస్తూ, చేవెళ్ళ ప్రభుత్వ ఆసుపత్రి, పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రి లో రోగులకు మరియు కస్తూరిబా మహిళా వసతి గృహ విద్యార్థినిలకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించి సేవాభావాన్ని చాటుకున్నా చేవెళ్ళ మండల మైనారిటీలు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఫరీన్ ఖదీర్ పాషా, ఉర్దూ రిపోర్టర్ సిరాజుద్దీన్, హాజీ, నజీమ్, చోటు, అక్బర్, రఫీ, నవీద్, ఖలేద్, జమ్మూ, సలీం, నాహేద్, ఖాజా పాషా, రెహమాన్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ ఘని, కో ఆప్షన్ మెంబర్ చాంద్ పాషా, ఎన్.ఎస్.యూ.ఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండీ. సమీరుద్దీన్, ఫయాజ్, బీఆర్ఎస్ నాయకులు జాహేద్, మసరత్, ఇస్మాయిల్, రియాజ్, రఫీఖ్, ఫైమీద్, హామీద్ షరీఫ్, ఖాజా, లతీఖ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఘట్‌కేసర్, ఆగష్టు 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మత్తులు, తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ ఏఈఈ పవన్‌చంద్ తెలిపారు. 33/11 కెవి అంకుషాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి అంకుషాపూర్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అంకుషాపూర్, ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాల, కళాశాల రోడ్డు, అంకుషాపూర్ వ్యవసాయ వినియోగదారులు, 11 కెవి మాధారం ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాధారం, మాధారం పౌల్ట్రీ ఫారంలు, మాధారం వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు, రైతులు గమనించి తమకు సహకరించాలని ఏఈఈ కోరారు.

# ఎన్ఎఫ్‌సీ నగర్‌లో గంజాయి విక్రేత అరెస్టు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ ఎక్సైజ్


గంజాయి ఇంట్లో ఉంచి విక్రయిస్తూ పట్టుబడిన నిందితుడు నిఖిల్‌తో ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు.

పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌ఫ్‌సీ నగర్‌లోని ఓ ఇంటిలో అక్రమంగా గంజాయి నిల్వచేసి విక్రయాలకు పాల్పడుతున్నాడనే సమాచారంతో పోలీస్‌లు దాడి చేసి ఒక కిలో 960 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గంజాయి విక్రయదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్ఎఫ్‌సీ నగర్ శ్రీనివాస కాలనీ ప్లాటు నెంబరు 177లో గల ఇంటిలో ఓ వ్యక్తి గంజాయి నిల్వ ఉంచి విక్రయాలకు పాల్పడు తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ రవి తన సిబ్బందితో కలిసి గంజాయి విక్రేత ఇంటిపై దాడి చేసి ఎండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విక్రేత మాధవ్ నిఖిల్ ( 23 )ని అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించగా గత ఐదేళ్లుగా గంజాయి విక్రయించినట్లు తెలిపారు. ఇటీవల రెండు నెలల నుండి తిరిగి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం నుండి కిలో 25 వేలకు కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చిడి చేసి ఐదు గ్రాముల గంజాయిని 800 రూపాయలకు విక్రయిస్తు జీవనం సాగిస్తూన్నట్లు తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయి కిలో 960 గ్రాములతో పాటు హోండా యాక్టివ్ స్కూటి ( టీఎస్ 08 హెచ్ఆర్ 6994 )ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి ఐ పోన్‌ను సైతం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ఆమనగల్లులో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**ఆమనగల్లు, ఆగస్టు26, ప్రభాతవార్త:** ప్రవక్త జన్మదిన సంధర్బంగా ఆమనగల్లు పట్టణంలో నూరే ముస్తఫా నౌ జవాన్ కమిటీ వారి ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించారు. వేడుకల సంధర్బంగా పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు వేడుకలకు ముఖ్య అతిథిగా సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, కౌన్సిలర్లు నాగిళ్ళ జగన్, కౌన్సిలర్ వెంకటయ్యలు హాజరైనారు. ఈమేరకు వారు జెండా ఊపి మిలాద్ ర్యాలీని ప్రారంభించారు. ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా కొనసాగించి జాతీయ రహదారిపై ప్రదర్శించారు. ర్యాలీలో మతపెద్దలు, యువకులు, చిన్నారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అంతకు ముందు పట్టణంలోని ప్రముఖ మసీదులలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసంధర్బంగా మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వేడుకల సంధర్బంగా చేపట్టిన ర్యాలీని స్థానిక పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండి మాసుమ్, అఫ్జల్, ఏంఏ పాషా, నహీమ్, సమీయోద్దిన్, జహాంగీర్, నవ జవాన్ కమిటీ నాయకులు అహ్మద్, హఫీజ్, కలీమ్, అసద్, మూస, సమీర్, జునైద్, గౌస్, అక్బర్, మహబూబ్, షరీఫ్, ఫిద్దు తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్ పత్యనాయక్‌ను సన్మానిస్తున్న ముస్లీంసోదరులు

# కేశంపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పిప్పళ్ళ శ్రీనాథ్

**కేశంపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :**



కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం (యువజన కాంగ్రెస్) కేశంపేట మండల అధ్యక్షుడిగా నియామకమైన పిప్పళ్ళ శ్రీనాథ్ ను, కొత్తపేట పిఏసిఎస్సి ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ కేశంపేట్ మండల సీనియర్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నాయకులు శ్రీనాథ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... మండలంలో యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో శ్రీనాథ్ కీలక పాత్ర పోషించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, యువతను ఏకం చేసి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పిప్పళ్ళ శ్రీనాథ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు అల్వాల సర్పంచ్ సురేష్ రెడ్డి, బొదునంపల్లి సర్పంచ్ ఎగిరి నాగేశ్వర్ , మంగలి గూడ సర్పంచ్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ రాజేందర్ రెడ్డి, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు జూలపల్లి అనసూయ, కోడూరు రాములు, హరీశ్వర్ రెడ్డి, కొడిపర్తి శ్రీకాంత్, హబీబ్, అఖిల్, శ్రీకాంత్, సచిన్ మహేష్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కొడంగల్‌లో మొహ్మద్ ప్రవక్త జన్మదిన ర్యాలీ

**కొడంగల్,అగష్టు 26,ప్రభాతవార్త:**

మిలాద్ ఉన్ నబీ(మొహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం)ను పురస్కరించుకొని ముస్లీం సోదరులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.మైనార్టీ నాయకులు ఎస్బీ.గుల్షన్ అద్వర్యంలో సీఐ చంద్రశేఖర్‌రెడ్డి,ఎస్సై జీవీ.సత్యనారాయణలను సన్మానించారు.బుధవారం కొడంగల్ పట్టణంలోని జామే మసీదులో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.అనంతరం మసీదు నుంచి నినాదాలతో అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.అక్కడే పావురాలను వదిలి శాంతి సందేశాన్ని వ్యక్తపరిచారు.అలాగే పట్టణంలోని మక్కా,జామే మసీదులో మిలాద్ ఉన్ నభీ సందర్బంగా ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు.ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతు మొహ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాత్వాలకు,సోదరబావాన్ని బోధించారని ఆయన చూపిన సన్మార్గంలో పయనిస్తు ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం ప్రార్ధించాలన్నారు. మొహ్మద్ ప్రవక్త జీవితాన్ని సూర్తిగా తీసుకొని సన్మార్గంలో నడుస్తు వారి బోదనలను సార్దకం చేయాలని ఆకాంక్షించారు.మీలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని 12 రోజుల పాటు మసీదుల్లో మొహ్మద్ ప్రవక్త ప్రాశస్త్రాన్ని,జీవిథగాధ,జీవనశైలిని వివరించారు.కార్యక్రమంలో ముస్లీం సోదరులు ఆసీఫ్ షేక్ ఆదిల్,అఫీస్ అజిజ్,ఎస్ఎస్‌కే సలీం,షాకీర్ ఖాద్రీ.ఫెరోజ్‌ఖాన్,కాంగ్రేస్ సీనియర్ నాయకులు సయ్యద్ అశ్వక్,షే అహ్మద్,అజర్‌బిన్ మక్సూద్,అజర్ బిన్ మక్సూద్, ఏకే.యుసుఫ్, ఇందనూర్ బషీర్,కొడంగల్ కాంగ్రేస్ పట్టణ అధ్యక్షులు కొడంగల్ నయ్యూం,మున్సిపల్ కౌన్సిలర్ అంజద్‌కాన్,సర్తాజ్ అహ్మద్‌ఖాన్,జహీర్ ఉద్దీన్,సిరాజ్ ఉద్దీన్,మహమ్మద్ మోహిలతో పాటు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెల్లాపూర్ మత్స్యకార సంఘం ఎకగ్రీవం ఎన్నిక

## మత్స్యకార సంఘం ఛైర్మన్‌గా పెద్ద అంజిలయ్య

**కుల్కచర్ల, ఆగస్టు 26,(ప్రభాతవార్త):** చెల్లాపూర్ మత్స్యకార సంఘం నూతన ఛైర్మన్ ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి.సంఘం సభ్యులు, మత్స్యకారుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా పర్వతపురం పెద్ద అంజిలయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.చిన్న రాములు,కార్యదర్శిగా నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, సంఘం అభివృద్ధికి సభ్యుల సంక్షేమానికి సమిష్టిగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు.డైరెక్టర్లుగా ఎన్నికైన అంజిలయ్య, చుక్కయ్య,చెన్నయ్య,వెంకటయ్య,కష్టయ్య, వెంకటస్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉప అధ్యక్షులు కొండ అంజనేయులు,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామ సభలు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 26,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు జగదీశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. . సంబంధిత ఓటరు జాబిత గ్రామసభలలో డ్రాఫ్ ఓటర్ లిస్ట్‌ను చదివి వినిపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. . డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో అర్హత కలిగిన ఓటరు పేరు లేకపోతే ఫారం6 ద్వారా కొత్తగా పేరు నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఓటరు వివరాలలో ఏవైనా మార్పులు లేదా సవరణలు అవసరమైతే ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవాన్నారు. అర్హత లేని ఓటరు పేరు ఉన్నట్లయితే ఫారం7 ద్వారా అభ్యంతరం/తొలగింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు,

## హకీంపేట్ ఆర్టీసి డిపో టిఎంయూ గౌరవాధ్యక్షులుగా భీమిడి జైపాల్‌రెడ్డి



హకీంపేట్ ఆర్టీసి డిపో టిఎంయూ గౌరవాధ్యక్షులుగా భీమిడి జైపాల్‌రెడ్డి నియమితులైనట్లు నియామక పత్రాన్ని అందజేసిన టిఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామరెడ్డి,పాల్గొన్న నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:** హకీంపేట్ ఆర్టీసి డిపో టిఎంయూ గౌరవాధ్యక్షులుగా జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. దీనికి ముందుగా టిఎంయూ నాయకులు అందరు ఏకగ్రీవంగా బి.జైపాల్‌రెడ్డి పేరును ప్రతిపాదించటంతో డిపో గౌరవాధ్యక్షులుగా జైపాల్‌రెడ్డి ఎన్నికైనట్లు అధికారికంగా రాష్ట్ర టిఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వద్దామరెడ్డి ప్రకటించి నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయూ) హకీంపేట్ ఆర్టీసి డిపోకు గౌరవాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై నియమితులు కావటం పట్ల ఆర్టీసి కార్మికులు, అభిమానులు అందరు జైపాల్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. పలువురు నాయకులు, ఆర్టీసి కార్మికులు పాల్గొని జైపాల్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. బుధవారం శామీర్‌పేట (డివిజన్) మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపోకు టిఎంయూ గౌరవాధ్యక్షులుగా నియమితులైన జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా డిపోకు టిఎంయూ గౌరవాధ్యక్షులుగా ఎన్నుకోవటం పట్ల ఆ యూనియన్ నాయకులకు, ఆర్టీసి కార్మికులకు ప్రత్యేక దన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ అలాగే గత ప్రభుత్వ హాయంలో ఆర్టీసి కార్మికులు చేపట్టిన అనేక ఉద్యమాలకు తాను మద్దతు తెలుపటం జరిగిందని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సారధ్యంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు దశలవారీగ నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టీసి కార్మికుల సమస్యల పరిష్కారం తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని బి.జైపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ టిఎంయూ అధ్యక్షులు పవన్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, నాయకులు తులసీరామ్, శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటేశ్, కృష్ణ, మాలిక్, పుష్పలత, భూపాల్, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్‌యాదవ్, తలగామ జగన్, వజ్జల శేశాంత్, పారనంది బాలరాజ్, ఎండి జాఫర్, శ్రీకాంత్, కత్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ధర్మ ప్రచారాన్ని మరింత ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



ఉద్దెమర్రిలోని అక్కన్న,మాదన్న శ్రీవిష్ణు,శివాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాయబారపు రవిరాజు,పాల్గొన్న అయ్యప్ప గురుస్వాములు, స్వాములు,భక్తులు

**శామీర్‌పేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**శ్రీఅయ్యప్ప ధర్మ ప్రచారాన్ని మరింత ప్రజల్లోకి తీసుకవెళ్లాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబిఏపి) జాతీయ కోశాధికారి రాయబారపు రవిరాజు సూచించారు. బుధవారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిలోని అక్కన్న,మాదన్నల శ్రీవిష్ణు,శివాలయంలో ఏబిఏపి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శ్రీపతి నాగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనిలో ముందుగా ఏబిఏపి మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ నియామకం విషయంపై సమావేశంలో చర్చించారు. కొల్తూర్ గ్రామానికి చెందిన తొర్రి మల్లేశ్‌ను జిల్లా జనరల్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ఆ తరువాత జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులైన తొర్రి మల్లేశ్‌ను జాతీయ కోశాధికారి రాయబారపు రవిరాజు, జిల్లా అధ్యక్షులు శ్రీపతి నాగరాజుతో పాటు పలువురు గురుస్వాములు, స్వాములు, భక్తులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఏబిఏపి జాతీయ కోశాధికారి రాయబారపు రవిరాజు మాట్లాడుతూ అయ్యప్ప ధర్మ ప్రచారాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్లటంతో పాటు భక్తులను ఏకతాటిపైకి తీసుక వచ్చేందుకు జిల్లా జనరల్ సెక్రటరీ మల్లేశ్ కృషి చేయాలని ఆయన సూచించారు. తనను జిల్లా జనరల్ సెక్రటరీగా నూతన బాధ్యతలు అప్పగించినందున సమర్దవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని మల్లేశ్ అన్నారు. ఈ సమావేశంలో సత్యంగురుస్వామితో పాటు పలువురు అయ్యప్ప గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## అన్న మృతదేహానికి చివరిసారిగా రాఖీ కట్టిన చెల్లెలు

**షాద్‌నగర్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లిలో బుధవారం విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. చటాన్‌పల్లిలోని ఓ మటన్ షాపులో విద్యుత్ వైరు రిపేరు చేస్తుండగా జమాల్పూర్ నవీన్(యువకుడు)కు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలింది. వెంటనే స్థానికులు అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు నవీన్ 18వ వార్డు కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందులాల్‌కు దగ్గరి బంధువు కావడంతో వార్డులో విషాద ఛాయలు అలుముకున్నాయి.కాగా, రాఖీ పండుగ సమీపిస్తున్న వేళ అన్నను కోల్పోయిన చెల్లెలు పూజిత చివరిసారిగా తన అన్న నవీన్ మృతదేహానికి రాఖీ కట్టింది. అన్నను ఇక ఎప్పటికీ చూడలేనన్న బాధతో కన్నీటి పర్యంతమైన పూజిత, తన అన్నకు రాఖీ కడుతున్న దృశ్యం అక్కడున్న వారిని తీవ్రంగా కలచివేసింది. ఈ హృదయ విదారక దృశ్యాన్ని చూసిన పలువురు కంటతడి పెట్టారు. రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసే ఈ ఘటన, నవీన్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులను తీవ్ర విషాదంలో ముంచింది.

# చేవెళ్లలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

**చేవెళ్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపాలిటీ 15వ పలు అభివృద్ధి పనులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇంటి ప్రారంభంతోపాటు సిసి రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే అగ్ర భాగాన నిలబెడతామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి వార్డులో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, గుడిమల్కాపూర్ డైరెక్టర్ పాండు యాదవ్, నాయకులు కమిటీ శశి, రవి, వార్డు సభ్యులు

# కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** త్వరలో జరుగబోయే కార్పోరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుంధుభి మ్రోగించేందుకు నూతనంగా నియమించబడిన పార్టీ ప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని గ్రామాలకు నూతనంగా పార్టీ అధ్యక్షులను ఎంపిక చేసి వారికి నియమాకపు పత్రాలను డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ సమక్షంలో డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీబలోపేతం కొరకు నూతన అధ్యక్షులు నిత్యం ప్రజల్లో ఉండి ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేవిధంగా కృషి చేయాలని కోరారు. ప్రజలతో మమైకమై ఉండి వారి సమస్యలను పరిష్కరించే నాయకుడిగా ఎదగాలని కోరారు. పోచారం డివిజన్‌లో ఆయా గ్రామాలకు నియమించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. చౌదరిగూడ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మంచాల సుధాకర్, కొర్రెముల గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బి. మహేశ్, వెంకటాపూర్ గ్రామ అధ్యక్షుడిగా నీరుడి వెంకటేశ్, కాచవాని సింగారం గ్రామ అధ్యక్షుడిగా వి. మహేశ్ గౌడ్, ప్రతాప సింగారం గ్రామ అధ్యక్షుడిగా గ్యార సురేశ్, నారపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిజాం ఖాన్, పోచారం గ్రామ అధ్యక్షుడిగా పాలకూర నరేశ్ గౌడ్, అన్నోజిగూడ గ్రామ అధ్యక్షుడిగా పి. విజయ్ రెడ్డి, రాజీవ్ గృహకల్ప కాలనీ పార్టీ అధ్యక్షుడిగా జి. రమేశ్ గౌడ్, యంనంపేట్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సహదేవ్ గౌడ్, ఇస్మాయిల్ ఖాన్ గూడ గ్రామ అధ్యక్షుడిగా కె. లింగం ఎంపిక కాగా వీరికి జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా నియమాక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇ. కృష్ణారెడ్డి, పోచారం డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాలడుగు అమరేందర్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఏర్ర మాధవి, మెట్టు నర్సింహా రెడ్డి, ఏర్ర రాజు, బిఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**చేవెళ్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల పురపాలక సంఘం పరిధిలోని మోడల్ కాలనీలో వనమహోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం, స్వచ్ఛమైన గాలిని అందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన మరియు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ నెంబర్లు, మండల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచుల సంఘం అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, సీనియర్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఢిల్లీలో బిజెపి జాతీయ గిరిజన మోర్చా అధ్యక్షులు మన్నాలాల్ రావత్ ను కలిసి మోహన్ సింగ్

## సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

**నందిగామ, ఆగస్టు 26, ప్రభాతవార్త :** గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా చూడాలని జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్ అన్నారు. బీజేపీ జాతీయ గిరిజన మోర్చా అధ్యక్షులు మన్నాలాల్ రావత్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన ఢిల్లీ వెళ్లి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ సింగ్ మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి బిజెపి చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ తో కలిసి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నట్లు తెలిపారు.

## కొనసాగుతున్న జిల్లాస్థాయి క్రీడల శిక్షణ

**తలకొండపల్లి, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గత మూడు రోజులుగా జిల్లాస్థాయి క్రీడాకారులకు శిక్షణ కొనసాగుతుంది. వెల్జాల్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నీ విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం నాడు మూడో రోజుకు చేరుకుంది. ఈ క్రీడలను గ్రామంలో యువకులు గ్రామస్తులు ఆసక్తిగా వీక్షించారు. పాఠశాల విద్యార్థులకు ఈ క్రీడలు నిర్వహించడం ఎంతో అవసరమని, క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ పట్టుదల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, పలువురు కొనియాడారు. ఈ క్రీడల నిర్వహణకు స్వచ్ఛందంగా గౌడ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుమని రాఘవేంద్ర గౌడ్ 4000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి క్రీడాకారులను అభినందించారు. మంచి క్రీడలతో తమ గ్రామానికి కుటుంబానికి మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్రీడ ఉపాధ్యాయులు గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొడంగల్ రూరల్, ఆగస్టు 26 (ప్రభాతవార్త) :** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన కర్రె శనకమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాతా రమాబాయి అంబేద్కర్ కమిటీ ఆధ్వర్యంలో కుటుంబానికి రూ.20,100 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు మల్లమ్మ, సభ్యులు శోభా, శిరీష, అంజమ్మ, అమృతమ్మ, పార్వతమ్మ, కవిత, కృష్ణవేణి, శాంతమ్మ, సరస్వతి, సావిత్రి, అపర్ణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన డాక్యుమెంట్ రైటర్లు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26, ప్రభాతవార్త:** తాండూరు పట్టణంలో స్థలాల మార్కెట్ విలువలను తగ్గిస్తు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై డాక్యుమెంట్ రైటర్లు హర్షం వ్యక్తం చేస్తు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తాండూరులో గతంలో అధిక మార్కెట్ విలువల కారణంగా స్థలాలు, ఆస్థుల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని డాక్యుమెంట్ రైటర్లు ఈ సమస్యను పరిష్కరించేందుకు భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని ఎమ్మెల్యేకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని ఎమ్మెల్యే ప్రభుత్వం సంబందిత మంత్రి శాఖ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేసారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చొరవ చూపిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా డాక్యు మెంట్ రైటర్లు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

## అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు ఇవ్వాలి



చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు పీఏసీఎస్ పాలకవర్గం ఏర్పాటుపై వినతిపత్రం

**షాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** నిత్యం పార్టీ కోసం పనిచేస్తూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్న అసలైన కార్యకర్తలను గుర్తించి వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. షాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొత్త పాలక మండలి ఏర్పాటులో ప్రస్తుతం ప్రతిపాదించిన కమిటీని పునఃసమీక్షించి, పార్టీ కార్యకర్తల సూచనల మేరకు కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీని వీడకుండా నిబద్ధతతో పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. డబ్బు, పలుకుబడితో పదవులను అప్పగిస్తే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు న్యాయం జరిగేలా పీఏసీఎస్ పాలకవర్గాన్ని పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పీఏసీఎస్ పాలక మండలిని ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడుతున్న నికార్సైన కార్యకర్తలకు పదవుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు నవనీత స్వామి, ప్రభాకర్‌రెడ్డి, లావణ్య చెన్నయ్య, సబితా గోవర్ధన్‌రెడ్డి, స్వరూప మహేందర్‌గౌడ్, అశోక్, సందీప్, సవిత సుభాష్‌చంద్ర, శాంతమ్మ యాదయ్య, రాజేందర్‌రెడ్డి, మంగమ్మ పోచయ్య, నాయకులు జనార్దన్ రెడ్డి,వెంకట్ రెడ్డి, రవీందర్ నాయక్ , ఆంజనేయులు, రాహుల్, యాదయ్య , కిషోర్,రఫీక్ , సుభాష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి ,శేఖర్, వెంకటేష్, కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, సూర్య , గౌరీ, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజు, గోపాల్, రాఘవేందర్ ,మాధవరెడ్డి, మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొమ్మరాసిపేట్ గ్రామ శివారులో వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య

**శామీర్‌పేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

బొమ్మరాసిపేట్ గ్రామ శివారులో కొత్త రాములు (50) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. అయితే కూతురు మరణించినట్లు సమాచారం తెలియటంతో ఆ వెంటనే మనస్థాపంతో తండ్రి కొత్త రాములు (50) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు 112 ద్వారా సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ కె.నర్సింహ్మారెడ్డి, ఎఎస్ఐ మహేశ్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో నివాసం ఉంటున్న కొత్త రాములు (50) మేస్త్రీ పని చేస్తారని అన్నారు. అయితే బుధవారం ఆయన కూతురు మృతిచెందినట్లు రాములుకు సమాచారం తెలియటంతో ఆ వెంటనే మనస్థాపం చెంది బొమ్మరాసిపేట్ గ్రామ శివారులోకి వెళ్లి ఓ చెట్టుకు ఉరివేసుకుని కొత్త రాములు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఇతనికి ఇద్దరు భార్యలు ఉండగ మొదటి భార్య మృతిచెందినట్లు, ఆమె చెల్లిని రెండో భార్యగ వివాహం చేసుకున్నట్లు తెలిపారు. ఆయనకు ఇద్దరు కూతురులు, ఒక బాబు ఉన్నట్లు తెలిపారు. అయితే ఒక కూతురు వారి గ్రామంలో మృతిచెందినట్లు సమాచారం అందటంతో మనస్థాపం చెందినట్లు దీంతో కొత్త రాములు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ మార్చ్యూరికి తరలించినట్లు తెలిపారు. శామీర్‌పేట సిఐ కె.నర్సింహ్మారెడ్డి పర్యవేక్షణలో ఎఎస్ఐ మహేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచులు

## రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

**కుల్కచర్ల, ఆగస్టు 26,(ప్రభాతవార్త):** గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూసిన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని ముజాహిద్‌పూర్ సర్పంచ్ చంద్రభూపాల్ రావు , రాంరెడ్డిపల్లి సర్పంచ్ నరసింహులు యాదవ్, పటేల్ చెరువుతాండ సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ అన్నారు. మండలపరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులనుఅర్హులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత కేసీఆర్ ప్రభుత్వంలోపది సంవత్సరాలు ఏ ఒక్క రేషన్ కార్డు ఇచ్చింది లేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం రేషన్ కార్డు మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ అర్హులందరికి అందజేస్తుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అరుణభీమయ్య, రాంరెడ్డిపల్లి ఉప సర్పంచ్ లక్ష్మయ్య గౌడ్,గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమాధుల అభివృద్ధికి 75 లక్షల నిధులు మంజూరు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26, ప్రభాత వార్త:** క్రైస్తవ సమాధుల అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించేపూచీ నాదేనని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. పోచారం డివిజన్ చౌదరి గూడ వెంకటాద్రీ టౌన్‌షిప్‌లోని ఎవన్‌జెల్కికాల్ చర్చిలో బుధవారం ఘటకేసర్ మండల ఫాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిషప్ విల్సన్ సింగం, మైనారిటీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్, రాష్ట్ర క్రైస్తవ నాయకులు గడ్డం సాల్మన్, మోజేష్‌లు హాజరయ్యారు. ఘట్‌కేసర్ మండల్ ఫాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంటు, నారాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దేశబత్తిని రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించన బడిన కార్యక్రమా నికి డీసీసీ అధ్యక్షుడు హాజరై మాట్లాడుతూ ఘట్‌కేసర్ మండలం మాదారం గ్రామంలో క్రైస్తవ సమాధుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రాంత క్రైస్తవుల అభ్యున్నతి కొరకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. గత కొంత కాలంగా క్రైస్తవులు సమాధుల విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనగా వాటినన్నింటిని అధిగమించినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు అయిన అసోసియేషన్ క్రైస్తవుల అందరికీ సమన్యాయం అందించాలని కోరారు. వారికి ఏ సమస్యవచ్చినా పరిష్కరించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఘట్‌కేసర్ మండల్ ఫాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ కార్యవర్గ వివరాలు సభ్యులు వెల్లడించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా రెవ జాన్ మార్క్ భూపతి, ఉపాధ్యక్షుడిగా వి.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంటుగా దేశబత్తిని రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా ఈ. మార్టిన్, కోశాధికారిగా ఫాస్టర్ పి. సునీల్ కుమార్‌లు ఎంపిక అయ్యినట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ఫాస్టర్లు, బిషప్‌లు, క్రైస్తవ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. పలువురికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంటు రాజేశ్ మాట్లాడుతూ క్రైస్తవ సమాజ సమస్యల పరిష్కరం, అభివృద్ధి, సంక్షేమం కొరకు నూతన కార్యవర్గం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ విల్సన్ సింగం, శంకర్, ఫీర్జాదీగూడ, మేడిపల్లి, మేడ్చల్ నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ఫాస్టర్లు పాల్గొన్నారు.

## ప్రతి రైతు డిజిటల్ క్రాప్ సర్వేను పూర్తి చేయాలి

### రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్

**తలకొండపల్లి, ఆగస్టు 26 ,ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని ప్రతి రైతు వ్యవసాయ పంటను డిజిటల్స్ క్రాప్ సర్వేను పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి కే సురేంద్రమోహన్ అన్నారు. బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలోని రైతుల మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతునుద్దేశించి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ ఏ ఈ ఓ లు రైతులందరి వంట చేను వద్దకు వెళ్లి డిజిటల్ క్రాప్ సర్వేని విధిగా నిర్వర్తించాలని సూచించారు. ఈ డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా రైతులకు అనేక లాభాలు ఉన్నాయని ప్రభుత్వ పథకాలు సులభంగా పొందే అవకాశం, రైతులకు పెట్టుబడి సాయం ప్రోత్సాహకాలు, తోపాటు పంట కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. రైతులకు పంట బీమా క్లైమ్ సులభంగా వస్తుందని సాగు ప్రణాళికలు మార్కెట్ వివరాలు తదితల లాభాలు రైతులకు విరివిగా




పట్టు రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్

లభించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులందరూ వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి సాగు చేస్తున్న పంటల వివరాలు తెలియజేయాలని, ప్రతి రైతు తన పొలంలో ఉండి సర్వే పూర్తయ్యేలా చూడాలని పంట మార్పిడి, పంట వివరాలను తప్పనిసరిగా అధికారులకు తెలియజేశాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండలంలోని సర్వేయర్లు ఏఈవోలు సర్వేర్లు, ఏఈవోలు రైతు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

**మేడ్చల్, ఆగస్టు 26. ప్రభాతవార్త :** పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలోని పానుగంటి సువర్ణ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు గ్రామీణ, పట్టణ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు ముదిరాజ్, మాజీ జెడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మాజీ కౌన్సిలర్లు పానుగంటి సుహాసిని, కౌడే మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకాల శివ కుమార్, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, ఉదండపురం సత్యనారాయణ, బండి శ్రీనివాస్ గౌడ్, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, పిట్ల లక్ష్మణ్ ముదిరాజ్, రామన్నగారి సంతోష్ గౌడ్, పానుగంటి రవీందర్, సద్ది సుదర్శన్ రెడ్డి, లవంగు రాకేష్ వంజరి, శ్రీధర్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు